06-06-2020 ఉదయము మురళి ఓంశాంతి బాప్‌దాదా మధువనము

“ మధురమైన పిల్లలారా - ఈ అనంతమైన ఆటలో మీరు ఆత్మ రూపి నటులు పాత్రధారులు, మీ నివాస స్థానము మధురమైన నిశ్శబ్ద గృహాము(స్వీట్ సైలెన్స్ హోమ్). ఇప్పుడు అక్కడకు వెళ్ళాలి ”

ప్రశ్న :- ఎవరైతే డ్రామా ఆటను యదార్థంగా అర్థము చేసుకున్నారో, వారి నోటి నుండి ఏ మాటలు వెలువడవు?

జవాబు :- ఇది ఇలా జరగకుండా ఉండకపోతే, ఇలా అయ్యేది.... ఇది జరిగి ఉండరాదు. డ్రామాను తెలుసుకున్నవారు ఇలాంటి మాటలు మాట్లాడరు. ఈ డ్రామా ఆట పేను వలె తిరుగుతూ ఉంటుందని, ఏమి జరుగుతున్నా అదంతా డ్రామాలో నిర్ణయమై ఉంది, చింతించే మాటే లేదు అని పిల్లలకు తెలుసు.

ఓంశాంతి. బాబా పిల్లలకు తన పరిచయాన్ని ఇచ్చినప్పుడు వారికి తమ పరిచయము కూడా లభిస్తుంది. పిల్లలందరు చాలా సమయము వరకు దేహాభిమానులుగా ఉంటారు. దేహీ-అభిమానులుగా ఉంటే తండ్రి యదార్థ పరిచయము తెలిసి ఉండాలి. కాని డ్రామాలో లేనే లేదు. భలే, భగవంతుడు గాడ్‌ఫాదర్ అని అంటారు, కాని రచయిత అని అన్నా వారెవరో ఎవ్వరికీ తెలియదు. శివలింగ చిత్రము కూడా ఉంది కాని వారు అంత పెద్దగా లేనే లేరు. యథార్థంగా తెలియనందున తండ్రిని మర్చిపోతారు. తండ్రి రచయిత. వారు తప్పకుండా నూతన ప్రపంచమునే రచిస్తారు, అంటే పిల్లలైన మనకు నూతన ప్రపంచ రాజధాని వారసత్వము ఉండాలి. స్వర్గము అను పేరు కూడా భారతదేశములో ప్రసిద్ధంగా ఉంది, కాని కొంచెము కూడా అర్థము చేసుకోరు. ఫలానావారు మరణించారు, స్వర్గస్థులైనారు అని అంటారు. కాని ఎప్పుడైనా ఇలా జరుగుతుందా? నంబరువారుగా మనమంతా తుచ్ఛబుద్ధిగా ఉండేవారమని పిల్లలకు తెలుసు. ముఖ్యమైనవారికి మాత్రమే వివరంగా అర్థము చేయించబడ్తుంది - నేను వీరిలో వస్తాను, అనేక జన్మల అంతిమ శరీరములో వస్తాను. వీరు నంబర్‌వన్, ఇప్పుడు మనము వారి పిల్లలుగా, బ్రాహ్మణులుగా అయ్యామని పిల్లలకు తెలుసు. ఇవన్నీ అర్థము చేసుకోవలసిన విషయాలు. తండ్రి ఇంత సమయము నుండి అర్థము చేయిస్తూనే వచ్చారు, లేకుంటే తండ్రిని గుర్తించడం సెకండు విషయమే. తండ్రి చెప్తున్నారు - నన్ను స్మృతి చేస్తే మీ వికర్మలు వినాశనమౌతాయి. నిశ్చయమైపోతే ఏ విషయంలో కూడా ప్రశ్నలు మొదలైనవి ఉత్పన్నమవ్వవు. తండ్రి అర్థము చేయించారు - మీరు శాంతిధామములో ఉన్నప్పుడు పావనంగా ఉండేవారు. ఈ విషయాలు కూడా మీరే తండ్రి ద్వారా వింటున్నారు. ఇతరులెవ్వరూ వినిపించలేరు. ఆత్మలమైన మనము ఎక్కడి నివాసులమో మీకు తెలుసు. ఏ విధంగా నాటకములోని పాత్రధారులు, మేమిక్కడి నివాసులము, వస్త్రాలు మార్చుకుని నాటక రంగము పైకి వచ్చామని అంటారో ఇదీ అంతే. మనమిక్కడి నివాసులము కామని మీకు తెలుసు. ఇది ఒక నాటకశాల. ఇది ఇప్పుడే బుద్ధిలోకి వచ్చింది - మేము మూలవతన నివాసులము. దానిని మధురమైన సైలెన్స్ హోమ్ అని కూడా అంటారు. ఆత్మ దుఃఖములో ఉన్నందున అందరూ దానినే(ఆ ఇంటినే) కోరుకుంటారు. మేమెలా వాపస్ ఇంటికి వెళ్ళాలని

అడుగుతారు. ఇంటి చిరునామా తెలియనందున భ్రమిస్తూ ఉంటారు. ఇప్పుడు మీరు వెతుకుట నుండి విడుదలైపోయారు. ఇప్పుడు మనము తప్పకుండా ఇంటికి వెళ్లాలని పిల్లలకు తెలిసింది. నేను ఆత్మను, ఎంత చిన్న బిందువును! ఇది కూడా విచిత్రమే. దానిని కుదరత్(స్వాభావికము) అని అంటారు. ఇంత చిన్న బిందువులో ఎంత పాత్ర నిండి ఉంది! పరమపిత పరమాత్మ పాత్రను ఎలా అభినయిస్తారో కూడా మీరు తెలుసుకున్నారు. అందరికంటే ముఖ్య పాత్రధారులు వారే. చేసి చేయించేవారు(కరన్‌కరావన్ హార్) కదా. మధురాతి మధురమైన పిల్లలైన మీకిప్పుడు ఆత్మలైన మనము శాంతిధామము నుండి వస్తామని అర్థమయింది. శరీరంలో ప్రవేశించే ఆత్మలు కొత్తవేమీ వెలువడవు. ఆత్మలన్నీ మధురమైన ఇంటిలో ఉంటాయి. అక్కడ నుండి పాత్రను అభినయించేందుకు వస్తాయి. అందరూ పాత్రను అభినయించాలి. ఇది ఆట. ఈ సూర్య-చంద్రులు, నక్షత్రాలు మొదలైనవన్నీ ఏమిటి? ఇవన్నీ దీపాలు. ఇందులో రాత్రింబవళ్ల ఆట నడుస్తూ ఉంటుంది. కొందరు సూర్య దేవతాయ నమః , చంద్ర దేవతాయ నమః..... అని అంటారు కాని వాస్తవానికి వారు దేవతలు కానే కారు. ఈ ఆట గురించి ఎవరికీ తెలియదు. సూర్య-చంద్రులను కూడా దేవతలని అనేస్తారు. వాస్తవానికి వారు దేవతలు కానే కారు. నిజానికవి ఇంత పెద్ద విశ్వనాటకానికి దీపాలు. మనము మధురమైన శాంతిగృహ నివాసులము. మనమిక్కడ పాత్రను అభినయిస్తున్నాము, ఈ చక్రము పేను వలె తిరుగుతూ ఉంటుంది, ఏం జరిగినా అది డ్రామాలో నిర్ణయించబడి ఉంది. ఇలా కాకుండా ఉంటే ఇలా అయ్యేది అని అనరాదు. ఇది డ్రామా కదా. ఉదాహరణకు మీ తల్లి(మమ్మా) ఎవరైతే ఉండినారో, వెళ్లిపోతారని సంకల్పములో కూడా లేదు, శరీరాన్ని వదిలేశారు - మంచిదే. ఇది డ్రామా. ఇప్పుడు తన నూతన పాత్రను అభినయిస్తూ ఉంది. చింతించే విషయమే కాదు. మేమంతా పాత్రధారులమని ఇక్కడ పిల్లలందరి బుద్ధిలో ఉంది. ఇది ఓటమి-గెలుపుల ఆట. ఈ ఓటమి-గెలుపుల ఆట మాయ పై ఆధారపడి ఉంది. మాయతో ఓడినవారు ఓడినట్లే. గెలిచినవారు గెలిచినట్లే. ఇది అందరూ పాడ్తారు కాని బుద్ధిలో కొద్దిగా కూడా జ్ఞానము లేదు. మాయ అంటే ఏమిటో మీకు తెలుసు, అతడు రావణుడు. అతనినే మాయ అని అంటారు. ధనాన్ని సంపద అని అంటారు. ధనమును మాయ అని అనరాదు. వీరి వద్ద చాలా ధనముంటే మాయ యొక్క నషా ఉందని అనేస్తారు. కాని మాయ నషా ఎక్కడైనా ఉంటుందా! మాయను మనము జయించేందుకు ప్రయత్నిస్తాము. కావున ఏ విషయంలో కూడా సంశయము రాకూడదు. అపరిపక్వమైన(కచ్చా) స్థితి వల్లనే సందేహాలు కలుగుతూ ఉంటాయి. ఇప్పుడు భగవానువాచ - ఎవరికి? - ఆత్మలకు. భగవంతుడంటే శివుడే. వారు ఆత్మలకు చెప్తున్నారు. కృష్ణుడైతే దేహధారి. అతడు ఆత్మలకు ఎలా చెప్పగలడు. మీరు ఏ దేహధారుల జ్ఞానాన్ని వినిపించడం లేదు. తండ్రికి దేహమే లేదు. ఇతరులందరికీ దేహముంది. ఎవరిని పూజిస్తారో వారిని స్మృతి చేయడము సులభము. బ్రహ్మ-విష్ణు-శంకరులను దేవతలు అని అంటారు. శివుని భగవంతుడని అంటారు. శ్రేష్ఠాతి శ్రేష్ఠమైన వారు భగవంతుడు, వారికి దేహమే లేదు. మూలవతనంలో ఆత్మలున్నప్పుడు దేహముండేదా? లేదు. మీరు ఆత్మలుగా ఉండేవారు. ఈ బాబా కూడా ఆత్మనే. కాని వారు పరమ ఆత్మ. వారి పాత్ర గాయనము చేయబడింది. పాత్ర చేసి వెళ్లారు కనుకనే వారికి పూజ జరుగుతూ ఉంది. 5 వేల సంవత్సరాల క్రితము కూడా రచయిత అయిన పరమపిత పరమాత్మ వచ్చారు. వారు స్వర్గ రచయిత అని తెలిసిన మనిషి ఒక్కరు కూడా లేరు. ప్రతి 5 వేల సంవత్సరాల తర్వాత కల్పము యొక్క సంగమ

యుగములో వారు వస్తారు. కాని కల్పము ఆయువును చాలా ఎక్కువగా దీర్ఘంగా వ్రాసేసినందున అందరూ మర్చిపోయారు. పిల్లలైన మీకు తండ్రి కూర్చుని అర్థము చేయిస్తున్నారు. బాబా - మేము కల్ప-కల్పము మీతో కలుస్తాము, మీ ద్వారా వారసత్వాన్ని తీసుకొని, ఎలా పోగొట్టుకుంటామో ఇదంతా మా బుద్ధిలో ఉందని మీరే స్వయంగా చెప్తారు. అనేక ప్రకారాల జ్ఞానముంది. కాని జ్ఞాన సాగరులని ఒక్క భగవంతుడినే అంటారు. వినాశనము తప్పకుండా జరుగుతుందని కూడా అందరికీ తెలుసు. ఇంతకుముందు కూడా వినాశనము జరిగింది. ఎలా జరిగిందో ఎవ్వరికీ తెలియదు. శాస్త్రాలలో వినాశనము గురించి ఏమేమో వ్రాసేశారు. పాండవుల కౌరవుల యుద్ధము ఎలా జరగగలదు!

ఇప్పుడు బ్రాహ్మణులైన మీరు సంగమ యుగములో ఉన్నారు. బ్రాహ్మణులకు ఏ యుద్ధము లేనే లేదు. తండ్రి చెప్తున్నారు - నా పిల్లలైన మీరు అహింసకులు, డబల్ అహింసకులు. ఇప్పుడు మీరు నిర్వికారులుగా అవుతున్నారు. మీరు కూడా బాబా ద్వారా కల్ప-కల్పము వారసత్వాన్ని తీసుకుంటారు. ఇందులో కష్టమనే మాటే లేదు. జ్ఞానము చాలా సహజము. 84 జన్మల చక్రము మీ బుద్ధిలో ఉంది. ఇప్పుడు నాటకము పూర్తి అవుతుంది. ఇక కొద్ది సమయము మాత్రమే మిగిలి ఉంది. షాహుకార్లకు కూడా ధాన్యము, నీరు లభించలేని సమయము వస్తుంది. దీనినే దుఃఖ పర్వతాలు విరిగిపడడము అని అంటారు. అనవసర రక్తపాతపు ఆట కదా. అందరూ సమాప్తమైపోతారు. ఎవరైనా తప్పు చేస్తే వారికి శిక్ష లభిస్తుంది. వీరేం తప్పు చేశారు? కేవలం ఒక తప్పు మాత్రమే చేశారు. తండ్రిని మర్చిపోయారు. మీరు తండ్రి ద్వారా రాజ్యపదవిని తీసుకుంటున్నారు. మిగిలిన మనుష్యులంతా ఇక మేము మరణించినట్లే అని భావిస్తారు. మహాభారత యుద్ధము కొంచెము ప్రారంభమయిందంటే మరణము తథ్యము. మీరు జీవించే ఉంటారు కదా. మీరు బదిలీ అయ్యి అమరలోకానికి వెళ్ళిపోతారు. ఈ చదువుకు గల శక్తితో వెళ్తారు. చదువును ఆదాయానికి మూలము అని అంటారు. శాస్త్రాలలోది కూడా చదువే. దాని ద్వారా కూడా ఆదాయము లభిస్తుంది. కాని అది భక్తిమార్గములోని చదువు. ఇప్పుడు తండ్రి చెప్తున్నారు - నేను మిమ్ములను ఈ లక్ష్మీనారాయణుల వలె తయారు చేస్తాను. మీరిప్పుడు స్వచ్ఛబుద్ధి గలవారిగా అవుతారు. మేము శ్రేష్ఠంగా అవుతామని, తిరిగి పునర్జన్మలు తీసుకుంటూ తీసుకుంటూ క్రిందకు దిగుతామని మీకు తెలుసు. కొత్తది నుండి పాతదిగా అవుతుంది. మెట్లు తప్పకుండా దిగాలి కదా. ఇప్పుడు సృష్టిలో దిగేకళ ఉంది. ఉన్నతమయ్యేకళ ఉన్నప్పుడు ఈ దేవతల రాజ్యముండేది, స్వర్గముండేది. ఇప్పుడుండేది నరకము. ఇప్పుడు మీరు మళ్ళీ స్వర్గవాసులుగా అయ్యేందుకు పురుషార్థము చేస్తున్నారు. బాబా - బాబా అని అంటూ ఉంటారు.

"ఓ గాడ్‌ఫాదర్" అని పిలుస్తారు కాని ఆ ఆత్మల తండ్రి శ్రేష్ఠాతి శ్రేష్ఠమైనవారని, వారి పిల్లలైన మనము ఎందుకు దుఃఖితులుగా ఉన్నామో ఎవరూ అర్థము చేసుకోరు. దుఃఖితులుగా అవ్వనే అవ్వాలని మీకిప్పుడు తెలిసింది. ఎందుకంటే ఇది సుఖ-దుఃఖాల ఆట కదా. గెలుపులో సుఖముంటుంది, ఓటమిలో దుఃఖముంటుంది. తండ్రి రాజ్యమును ఇచ్చారు. రావణుడు లాక్కున్నాడు. తండ్రి ద్వారా మనకు స్వర్గ వారసత్వము లభిస్తూ ఉంటుందని ఇప్పుడు పిల్లలైన మీ బుద్ధిలో ఉంది. ఇప్పుడు తండ్రి వచ్చారు. ఇప్పుడు కేవలం తండ్రిని స్మృతి చేస్తే పాపాలు అంతమవుతాయి. తలపై జన్మ-జన్మల పాపభారము ఉంది కదా. మీరేమీ చాలా దుఃఖితులుగా అవ్వరని కూడా మీకు తెలుసు. పిండిలో ఉప్పు ఉన్నంత అనగా కొంచెము సుఖము కూడా ఉంది. దానిని కాకిరెట్టతో సమానమైన సుఖమని అంటారు.

సర్వుల సద్గతిదాత ఒక్క తండ్రే అని మీకు తెలుసు. జగద్గురువు కూడా ఒక్కరే. వానప్రస్థ సమయములో గురువును స్వీకరిస్తారు. ఇప్పుడైతే చిన్నతనములోనే గురువు వద్దకు తీసుకెళ్తారు ఎందుకంటే ఒకవేళ చిన్నతనములోనే శరీరము వదిలేసినా సద్గతి పొందాలని భావిస్తారు. బాబా చెప్తున్నారు - వాస్తవానికి ఎవ్వరినీ గురువని అనరు. ఎవరైతే సద్గతినిస్తారో వారే గురువు. సద్గతిదాత ఒక్కరే. ఇక ఏసుక్రీస్తు, బుద్ధుడు మొదలైనవారంతా గురువులు కారు. వారు వచ్చినప్పుడు అందరికి సద్గతి లభిస్తుందా? క్రీస్తు వచ్చారు. వారి వెనుక వారి ధర్మమువారంతా రావడం ప్రారంభించారు. తీసుకు వచ్చేందుకు, నిమిత్తమైనవారిని గురువని ఎలా అంటారు. పతితపావనులని ఒక్క తండ్రిని మాత్రమే అంటారు. వారు అందరినీ వాపస్ తీసుకెళ్తారు. స్థాపన కూడా చేస్తారు, అందరినీ తీసుకెళ్ళిపోతే ప్రళయమైపోతుంది. ప్రళయము జరగనే జరగదు. సర్వశాస్త్రమయి శిరోమణి శ్రీమద్భగవద్గీత అని గాయనము చేయబడింది. యదా యదాహి.... అని గాయనముంది. తండ్రి భారతదేశములోనే వస్తారు. స్వర్గచక్రవర్తి పదవిని ఇచ్చేవారు తండ్రి. వారిని కూడా సర్వవ్యాపి అని అనేస్తారు. నూతన ప్రపంచములో పూర్తి విశ్వము పై మన ఒక్కరి రాజ్యమే ఉంటుందని పిల్లలైన మీకు ఎంతో సంతోషము కలుగుతుంది. ఆ రాజ్యాన్ని ఎవ్వరూ లాక్కోలేరు. ఇక్కడ చిన్న ముక్కల కొరకు పరస్పరములో ఎంతో కొట్లాడుకుంటూ ఉంటారు. మీకు మజాగా ఉంది. చంకలు ఎగిరేసి సంతోషముతో కుప్పిగంతులు వేయాలి. కల్ప-కల్పము మనము బాబా నుండి వారసత్వాన్ని తీసుకుంటామంటే ఎంత సంతోషము ఉండాలి. నన్ను స్మృతి చేయమని తండ్రి చెప్తున్నా కూడా మర్చిపోతారు. “బాబా యోగము తెగిపోతుంది” అని అంటారు. యోగమనే పదమును తీసేయండి. అది శాస్త్రాల పదము అని బాబా అంటారు. మీరు వారిని స్మృతి చేయకుంటే వికర్మలు ఎలా వినాశనమౌతాయి? రాజ్యము ఎలా లభిస్తుంది? స్మృతి చేయకుంటే పదవి కూడా తగ్గిపోతుంది. శిక్షలు కూడా అనుభవించవలసి వస్తుంది. ఈ తెలివి కూడా లేదు. బాగా బుద్ధిహీనులైపోయారు. నేను కల్ప-కల్పము వచ్చి సదా నన్ను ఒక్కరినే తలంపు చేయమని మీకు చెప్తాను. జీవించి ఉన్నా ఈ ప్రపంచము నుండి మరణించండి. బాబా స్మృతి ద్వారా మీ వికర్మలు వినాశనమౌతాయి. మీరు విజయమాలలో మణులుగా అవుతారు. ఎంత సహజము. సర్వ శ్రేష్ఠమైన శివబాబా, బ్రహ్మాబాబా ఇద్దరూ శ్రేష్ఠులే. వారు పారలౌకికము, వీరు అలౌకికము. ఎంతో సాధారణమైన టీచరు. ఆ టీచరైనా శిక్షిస్తారు. వీరు శిక్షించరు, బుజ్జగిస్తారు. మధురమైన పిల్లలారా, తండ్రిని స్మృతి చేయమని చెప్తారు. సతోప్రధానంగా అవ్వండి. పతితపావనులు ఒక్క తండ్రి మాత్రమే. గురువు కూడా వారొక్కరే. ఇతరులెవ్వరూ గురువుగా అవ్వలేరు. బుద్ధుడు నిర్వాణానికి వెళ్ళాడని అంటారు - అవన్నీ అసత్యాలే. ఒక్కరు కూడా వాపస్ వెళ్ళలేరు. అందరికి డ్రామాలో పాత్ర ఉంది. ఎంత విశాలబుద్ధి ఉండాలి, ఎంత సంతోషముండాలి! పై నుండి క్రింది వరకు పూర్తి జ్ఞానమంతా బుద్ధిలో ఉంది. బ్రాహ్మణులే జ్ఞానమును తీసుకుంటారు, శూద్రులకు గాని, దేవతలకు గాని ఈ జ్ఞానము లేదు. ఇప్పుడు అర్థము చేసుకునేవారు అర్థము చేసుకోండి. ఎవరు అర్థము చేసుకోరో వారికి మరణమే గతి. పదవి కూడా తగ్గిపోతుంది. స్కూలులో కూడా చదువుకోకుంటే పదవి తగ్గిపోతుంది. అల్ఫ్ అంటే తండ్రి, బే అంటే చక్రవర్తి పదవి. మనము తిరిగి మన రాజధానిని తీసుకుంటున్నాము. ఈ పాత ప్రపంచము సమాప్తమైపోతుంది. మంచిది.

మధురాతి మధురమైన అపురూపమైన పిల్లలకు మాత - పిత, బాప్‌దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్‌మార్నింగ్ ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము :-

1. మన నుండి ఎవ్వరూ లాక్కోలేని విశ్వచక్రవర్తి పదవిని తండ్రి మనకు ఇస్తున్నారు, ఈ సంతోషముతో గంతులేయండి.

2. విజయమాలలో మణిగా అయ్యేందుకు జీవించి ఉన్నా ఈ పాత ప్రపంచము నుండి మరణించాలి. తండ్రి స్మృతి ద్వారా వికర్మలు వినాశనము చేసుకోవాలి.

వరదానము :- “ ఒక్కరితోనే సర్వ సంబంధాలు నిభాయించే సర్వ హద్దుల నుండి ముక్తంగా ఉండే సంపూర్ణ ఫరిస్తా భవ ”

ఏదైనా ఒక పదార్థాన్ని తయారు చేయునప్పుడు, అది పూర్తిగా తయారైనప్పుడు ఆధారాన్ని ఎలా వదిలేస్తుందో, అలా మీరు సంపన్న స్థితికి ఎంత సమీపంగా వస్తారో అంత అందరి నుండి దూరమవుతూ ఉంటారు. ఎప్పుడైతే అన్ని బంధనాల నుండి వృత్తి ద్వారా దూరమవుతారో అనగా ఎవ్వరితోనూ ఆకర్షణ ఉండదో అప్పుడు సంపూర్ణ ఫరిస్తాలుగా అవుతారు. ఒక్కరితోనే సర్వ సంబంధాలు నిభాయించడమే ఠికానా(స్థిరమైన స్థానము). దీని ద్వారానే అంతిమ ఫరిస్తా జీవితమనే గమ్యము సమీపంగా అనుభవమవుతుంది. బుద్ధి భ్రమించడం సమాప్తమవుతుంది.

స్లోగన్ :- “ స్నేహము ఎటువంటి అయస్కాంతమంటే, అది నిందించేవారిని కూడా సమీపానికి తీసుకొస్తుంది.”